


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




గురువారం 25-06-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక : 08 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## సర్ పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### సొంత నేతలపై రేవంత్ రెడ్డి సీరియస్



2 లో

## మీరు బాగా చదవాలి..లేదంటే నాకు మైనస్ మార్కులు

**న్యూస్ డెస్క్, 24 జూన్ (ఇది కద నిజం):** సమాజంలో మార్పు తెచ్చేందుకే నేను అత్యంత కఠినమైన విద్యాశాఖను ఎంచుకున్నానని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దీనిని నేను ఛాలెంజ్‌గా స్వీకరించాను.. విద్యావ్యవస్థలో మార్పు తేవడం ఉపాధ్యాయుల సహకారంతోనే సాధ్యమవుతుంది.. దేశంలోనే ఆదర్శవంతంగా ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తీసుకురావాలన్నది నా ధ్యేయం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమవుతుందన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో పీ4 పథకంలో భాగంగా దాతల సహకారంతో రూ.1.4కోట్లతో నూతనంగా నిర్మించిన జెడ్పీ హైస్కూల్ నూతన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్ కొక్కిలిగడ్డ హైస్కూలు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ... గత రెండేళ్లలో విద్యావ్యవస్థలో సంస్కరణలన్నీ పూర్తి చేశాం, ఇక ఉపాధ్యాయులంతా పూర్తిగా ఫలితాలపైనే శ్రద్ధ వహించాలని సూచించారు. నేను విద్యామంత్రిగా బాధ్యతలు చేపట్టాక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాం. కొక్కిలిగడ్డ హైస్కూలులో లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ తప్ప అన్ని సౌకర్యాలు కల్పించాం. అభ్యసనా ఫలితాల మెరుగుదలపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి. ఫార్మేటివ్, సమ్మెటివ్ టెస్ట్ ఫలితాల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగుపర్చాలి.



2 లో

# తుంగభద్రపై తలపడ్డ తుఫాన్

# నీటి రాజకీయాలపై ఘాటు లేఖ

- కర్ణాటక ప్రాజెక్టులపై ఆగ్రహం
- తెలంగాణ వాటా తాకట్టు అన్న ఆరోపణ
- పాలమూరు రైతుల భవితపై ఆందోళన
- ఆర్డీఎస్‌కు ముప్పు తప్పదా?
- నీటి రాజకీయాలపై బీఆర్ఎస్ దాడి
- కర్ణాటక అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి
- జల హక్కుల కోసం పోరాట హెచ్చరిక
- నాలుగు డిమాండ్లతో హరీశ్ లేఖ
- కొడంగల్ లిఫ్ట్‌పై ప్రశ్నల వర్షం
- తెలంగాణ ప్రయోజనాలపై రాజీ వద్దు
- తుంగభద్ర జలాలపై కొత్త వివాదం
- ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు
- పాలమూరు హక్కుల కోసం పోరాటం



**న్యూస్ డెస్క్, 24 జూన్ (ఇది కద నిజం):** తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ ఒకటని కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయన్నారు. ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని బీఆర్ఎస్ ప్రభుత్వంలో గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందన్నారు.

ఇప్పుడూ అదే ద్రోహ బుద్ధి:

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనాలను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారంఅందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

మిగతాది 2 లో..

## సీఐ నాగరాజుకు రిమాండ్

### రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు





2 లో

**న్యూస్ డెస్క్, 24 జూన్ (ఇది కద నిజం):** నాగరాజు మిస్సింగ్ కేసులో కృష్ణలంక మాజీ సీఐ నాగరాజుకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆయన్ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. రౌడీషీటర్ సాయికృష్ణ మిస్సింగ్ కేసులో సంచలనల పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఓ కేసు విషయంలో సాయికృష్ణను మార్కాపురంలో అదుపులోకి తీసుకుని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు.

## బాల్యంలోనే ఏఐ పాఠాలు

### విద్యాశాఖ కొత్త కార్యాచరణ ఇదే!




2 లో

## ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

### 200 పైగా దగ్ధమైన కార్మికుల నివాసాలు



2 లో

**న్యూస్ డెస్క్, 24 జూన్ (ఇది కద నిజం):** ఢిల్లీలోని ఉద్యోగ్ భవన్ సమీపంలో ఉన్న కార్మికుల నివాసాల్లో (ఝుగ్గీలు) బుధవారం వేకువజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు 200 తాత్కాలిక రేకుల షెడ్లు అగ్నికి ఆహుతయ్యాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రాణనష్టం తప్పిందని అధికారులు వెల్లడించారు. ఢిల్లీ అగ్నిమాపక దళం (డిఎఫ్ఎస్) అధికారుల సమాచారం మేరకు.. తెల్లవారుజామున 3.02 గంటల ప్రాంతంలో కార్మికుల గుడిసెల వద్ద ఉన్న ఓ విద్యుత్ ప్యానెల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

# సాయిబాబా భక్తుల మనోభావాలను గౌరవిస్తాం

### వివాదంపై మంత్రి ఆనం క్లారిటీ

**న్యూస్ డెస్క్, 24 జూన్ (ఇది కద నిజం):** సాయిబాబా ఆలయాల విషయంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి దుష్ప్రచారం చేయడం సరికాదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా కొన్ని మీడియా సంస్థలు వ్యవహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

తాను కూడా సాయి భక్తుడినే

తాను వ్యక్తిగతంగా సాయిబాబా భక్తుడినని, ప్రతిరోజూ పూజా మందిరంలో స్వామివారిని పూజించిన తర్వాతే తన దినచర్య ప్రారంభిస్తానని మంత్రి స్పష్టం చేశారు. తన




2 లో

వ్యాఖ్యల వల్ల ఏ ఒక్క భక్తుడి మనోభావాలు దెబ్బతిన్నా హృదయపూర్వకంగా మన్నించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ లేదా టీటీడీ ఎవరిపైనా వివక్ష చూపడం లేదని, ఎవరైనా ఆరాధించే మహనీయులను కించపరిచే ఉద్దేశం తమకు లేదని పేర్కొన్నారు.

## తెలంగాణపై పవన్ కళ్యాణ్ స్పెషల్ ఫోకస్

### జనసేనలో చేరికల కోసం ప్రత్యేక జాయినింగ్స్ కమిటీ




2 లో

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం



## సర్ పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
## సొంత నేతలపై రేవంత్ రెడ్డి సీరియస్



**న్యూస్ డెస్క్, 24 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ (సర్) ప్రక్రియపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇంఛార్జ్ లు మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎస్ఐఆర్ అనేది అత్యంత సీరియస్ అంశమని, ఇందులో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై వర్చువల్ గా భేటీ జరిగింది. ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ నేతలు మీనాక్షి నటరాజన్, సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొందరు నాయకులు సర్ పైన నిర్లక్ష్యంగా ఉంటున్నారని పార్టీ కోసం పని చేయకపోతే మాకు అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

జిల్లాల వారీగా నా దగ్గర రిపోర్టు ఉంది:

సర్ అవగాహన సదస్సులపైన జిల్లాల వారీగా నా దగ్గర రిపోర్ట్ ఉందని జిల్లాల వారీగా మేం చూడటం లేదనుకుంటున్నారు. కానీ మేం అన్నీ నోట్ చేసుకుంటున్నామని సీఎం చెప్పారు. ఆదిలాబాద్ లో బీఆర్ఎస్ 4 సమావేశాలు పెడితే కాంగ్రెస్ 3 సమావేశాలే ఏర్పాటు చేసిందని, కొత్తగూడెంలో బీజేపీ 8 సమావేశాలు ఏర్పాటు చేసిందన్నారు. బీజేపీ నామమాత్రంగా ఉన్నా సమావేశాలు పెట్టిందని, ఓట్లు తొలగించే పార్టీ 160 సమావేశాలు పెడితే అధికారంలో ఉన్న మనం వెనుకబడి ఉన్నామని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తరుపున సర్ పైన అవగాహన సదస్సులు మరిన్ని జరగాలని సూచించారు. ఎస్ఐఆర్ విషయంలో సరిగ్గా వ్యవహరించకపోతే సమాజంలోని పేద ప్రజలకు భారీ అన్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. పేదల ఓట్లు పోతే వాళ్ల ఆధార్ కార్డు, రేషన్ కార్డు పోతుందని వాళ్లకు అన్యాయం జరగనివ్వొద్దన్నారు.

పది రోజులే గడువు.. మారకపోతే మార్చేస్తాం!

సర్ పైన ఇంఛార్జ్ మంత్రుల మరింత బాధ్యతాయుతంగా వ్యవహారించాలని పార్టీ ఆదేశాలను ఎవరైనా పాటించాల్సిందేనన్నారు. సఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించబోమని పని చేయకుండా పార్టీకి నష్టం కల్గిస్తామంటే చూస్తు ఉర్కొమన్నారు. పది రోజుల సమయం ఇచ్చి చూస్తామని పార్టీ ఆదేశాలను పట్టించుకోని గుర్తించి వారి స్థానంలో మరొక ఇంఛార్జ్ ని నియమిస్తామని స్పష్టం చేశారు. పార్టీ సర్పంచ్‌లతో సర్ పైన గ్రామాల్లో ప్రచారం చేయించి అవగాహన కల్పించాలన్నారు.

## సీఐ నాగరాజుకు రిమాండ్
## రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు

మొదటి పేజీ తరువాయి




ఆ తర్వాత కొంతకాలానికి తల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన కుమారుడు నాగరాజు ఆచూకీ కోసం ఆరా తీశారు.

సీఐ నాగరాజు తీరుతో అనుమానాలు

అయితే సీఐ నాగరాజు దూషించడం, సాయికృష్ణ చచ్చాడు అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో తల్లి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తన కుమారుడి ఆచూకీపై తల్లి విజయలక్ష్మి కోర్టుకు వెళ్లారు. దీంతో సాయికృష్ణ మిస్సింగ్ మిస్టరీగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ కేసు సంచలనంగా చర్చనీయాంశమైంది. దీంతో సాయికృష్ణ లాకప్ డెత్ అయ్యారనే ప్రచారం జరిగింది. ఈ మేరకు రాజకీయ దుమారం చెలరేగింది. సాయికృష్ణను పోలీసులు చంపేశారంటూ తీవ్ర విమర్శలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో సాయికృష్ణ మిస్సింగ్‌పై ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది.

రంగంలోకి దిగిన సిట్.. బయటకు అసలు విషయం

సాయికృష్ణ మిస్సింగ్ నేపథ్యంలో విచారణ చేపట్టిన సిట్ అధికారులు కీలక విషయాలను గుర్తించింది. సాయికృష్ణ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో మరణించినట్లు గుర్తించింది. విచారణలో కృష్ణలంక పోలీస్ స్టేషన్‌తో పాటు సాయికృష్ణను మార్కాంపురం తీసుకొచ్చిన సిబ్బందిని అధికారులు విచారించారు. ఈ విచారణలో సాయికృష్ణ మృతదేహాన్ని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో చూశానని ఎస్సై వాంగ్మూలం ఇచ్చారు. ఈ విషయాన్ని సీఐ నాగరాజు రిపోర్టులో సిట్ అధికారులు తెలిపారు. అంతేకాదు పోలీస్ స్టేషన్‌లో ఆధారాలను కూడా మాయం చేశారని, ఇందుకు సీఐనే కారణమని పీఎస్ పోలీసులు తెలిపినట్లు పేర్కొంది. సీసీ ఫుటేజ్ డేటా డీవీఆర్‌లో లేకుండా చేశారని, డీవీఆర్‌లను ఎఫ్ఎస్ఎల్‌కు పంపామని రిమాండ్ రిపోర్టులో సిట్ స్పష్టం చేసింది. సాయికృష్ణ మరణించిన విషయం తెలిసినా మెజిస్ట్రేట్‌కు సమాచారం ఇవ్వలేదని, సాయికృష్ణ తల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్తే సీఐ నాగరాజు దూషించారని, హైకోర్టు ముందు నిజాలు దాచారని, కోర్టును సైతం తప్పుదోవ పట్టించారని సిట్ అధికారులు వెల్లడించారు.

## మీరు బాగా చదవాలి.. లేదంటే నాకు మైనస్ మార్కులు

మొదటి పేజీ తరువాయి



వెనుకబడిన విద్యార్థుల పనితీరును మెరుగుపర్చేందుకు బ్రిడ్జి కోర్సు మెటీరియల్ ను అందజేస్తాం. వివిధ తరగతుల్లో వెనుకబడిన పిల్లలు ఏ సబ్జెక్టుల్లో బలహీనంగా ఉన్నారో తెలుసుకొని, అటువంటి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టండి. నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు.

తొలిసారిగా ప్రభుత్వ స్కూళ్ల ఫలితాలతో యాడ్స్

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల చిత్రాలతో పత్రికల్లో యాడ్స్ ఇచ్చామని మంత్రి లోకేశ్ చెప్పారు. గత విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు వచ్చాయి. ఉపాధ్యాయులు తమ రోజువారీ విధినిర్వహణలో ఏదైనా సమస్య తలెత్తితే మీరు ఎంఇఓ, డీఇఓలకు వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు, లీప్ యాప్ ద్వారా నేరుగా నాకు చెప్పొచ్చు. వచ్చేనెల 16,17,18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పేరెంట్-టీచర్ మీటింగ్ సమావేశాలను నిర్వహించాలని భావిస్తున్నాం. ఉపాధ్యాయులంతా చొరవ తీసుకొని తల్లిదండ్రులను చైతన్యపర్చి లీప్ యాప్ డౌన్ లోడ్ చేయించండి. విద్యావ్యవస్థలో నేను అనుకున్నది సాధించాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారుల సహకారం అవసరం. అందరి సమిష్టికృషితోనే అత్యుత్తమ ఫలితాలు రాబట్టగలుగుతాం. అందరం టీమ్ వర్క్‌గా పనిచేసి ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ సాధిద్దాం.. అని వివరించారు.

మీరు చదవకపోతే నాకు మైనస్ మార్కులు!

విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధిస్తే ముఖ్యమంత్రి నాకు మంచి మార్కులు వేస్తారు, మీరు సరిగా చదవకపోతే ఆయన నాకు మైనస్ మార్కులు వేస్తారు, నా భవిష్యత్తు మీపై ఆధారపడి ఉందని మంత్రి లోకేశ్ చమత్కరించారు. ఈ సందర్భంగా 9,10 తరగతుల విద్యార్థులతో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. మీ సౌకర్యం, మీ భవిష్యత్తు కోసం దాతలు అద్భుతంగా కొత్త భవనాలను నిర్మించారు. విద్యార్థులంతా కష్టపడి చదివి పాస్ పర్సంటేజిని పెంచాలి. ఇప్పటికే విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు ఇచ్చాం, త్వరలోనే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్స్, బూట్లు అందజేస్తాం. విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచిమార్కులతో మెరుగైన ఫలితాలు సాధించాలి. విద్యార్థుల పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు లీప్ యాప్‌ను రూపొందించాం. నా గురువుల వల్లే ప్రస్తుతం నేను ఈ స్థాయికి చేరుకున్నాను. విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. మంత్రి వెంట రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు ఉన్నారు.

## సాయిబాబా భక్తుల మనోభావాలను గౌరవిస్తాం..
## వివాదంపై మంత్రి ఆనం క్లారిటీ





హిందూ సంప్రదాయాల ప్రకారమే సాయిబాబా ఆలయాల్లో పూజలు జరుగుతున్నాయన్నది అందరికీ తెలిసిన విషయమే అన్నారు.

ఆ నిధులు నిబంధనల మేరకే

టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న 5,000 భజన మందిరాల కార్యక్రమం సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ దేవాలయాల నిర్మాణం అనే నిర్దిష్ట లక్ష్యంతో చేపట్టామన్నారు. శ్రీవాణి ట్రస్ట్ నిబంధనలు, పరిపాలనా విధానాల ప్రకారమే వీటికి నిధులు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. కేవలం ట్రస్ట్ లక్ష్యాలు, నిబంధనల ఆధారంగానే నిధుల కేటాయింపు జరుగుతోందని, ఈ పథకం కింద సాయిబాబా ఆలయాలకు నిధులు ఇవ్వకపోవడం అంటే స్వామివారిని లేదా భక్తులను అవమానించినట్లు కాదని మంత్రి వివరణ ఇచ్చారు. రాముడు, కృష్ణుడు, శివుడు, సాయిబాబా.. ఇలా ప్రజలు ఆరాధించే ఏ విశ్వాసాన్నీ ప్రభుత్వం కించపరచదని ఆనం స్పష్టం చేశారు. కేవలం ట్రస్టుల నిబంధనలు, పరిపాలనా విధానాలకు సంబంధించిన అంశాన్ని అనవసర వివాదంగా మార్చొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఎవరూ నమ్మవద్దని మంత్రి కోరారు.

## బాల్యంలోనే ఏఐ పాఠాలు..
## విద్యాశాఖ కొత్త కార్యాచరణ ఇదే!




**న్యూస్ డెస్క్, 24 జూన్ (ఇది కద నిజం):** రాష్ట్రంలోని పాఠశాల విద్యలో విద్యాశాఖ సంస్కరణల్లో భాగంగా మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులను బాల్యం నుంచే సిద్ధం చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. విద్యార్థులకు టెక్నాలజీని చేరువ చేస్తూ 3 నుంచి 5వ తరగతి పిల్లలకు వారానికి 80 నిమిషాల పాటు ఏఐ పాఠాలు చెప్పనున్నారు. మ్యాథ్స్, తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో పిల్లల సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ టూల్స్ వాడనున్నారు. గణితానికి 20 నిమిషాల చొప్పున వారానికి రెండు సార్లు, భాషా సబ్జెక్టులకు అంతే సమానంగా మొత్తం 80 నిమిషాల పాటు ఏఐ సాఫ్ట్ వేర్ తో పాఠాలు నేర్చుకుంటారు. ఇప్పటివరకు కేవలం ప్రభుత్వ పాఠశాలలకే పరిమితమైన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ప్రోగ్రాంను ఈ విద్యా సంవత్సరం 2026-27 నుంచి అన్ని ప్రైవేటు పాఠశాలల్లోనూ తప్పనిసరి చేస్తూ పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. తరగతులకు తగిన విధంగా అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో 1 నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులందరికీ ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

మెరుగుపడిన ర్యాంక్


నాలుగేళ్లుగా చేపట్టిన ప్రణాళికలతో జాతీయ స్థాయి సర్వేల్లో తెలంగాణ ర్యాంకు 36 నుంచి 26 కు మెరుగుపడిందని, దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ విద్యా సంవత్సరం పకడ్బందీ ప్రణాళికలు రూపొందించారు. జాతీయ స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యా ప్రమాణాలను పెంచడం, ర్యాంకింగుల్లో మెరుగైన స్థానాన్ని సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది.

మూడు రకాల పరీక్షలు

పిల్లల్లో ప్రాథమిక స్థాయిలోనే చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు లెర్నింగ్ ఎన్ రిచ్ మెంట్ పీరియడ్ పేరుతో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఏడాదిలో మూడు సార్లు జులైలో బేస్ లైన్ టెస్ట్, నవంబర్ లో మిడ్ లైన్ పరీక్షలు, మార్చిలో ఎండ్ లైన్ పరీక్షలు నిర్వహించి వాటి వివరాలను స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ లో నమోదు చేయాల్సి ఉంటుంది. తరగతి గదిలో వెనుకబడిన పిల్లల కోసం టీచర్ సపోర్టు గ్రూపులను ఏర్పాటుచేసి అందరికీ కనీస సామర్థ్యాలు మెరుగుపడేలా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుంది.

## తెలంగాణపై పవన్ కళ్యాణ్ స్పెషల్ ఫోకస్..
## జనసేనలో చేరికల కోసం ప్రత్యేక జాయినింగ్స్ కమిటీ

**న్యూస్ డెస్క్, 24 జూన్ (ఇది కద నిజం):** ఏపీ ప్రభుత్వంలో అత్యంత కీలకంగా మారిన జనసేన పార్టీ.. తెలంగాణపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. రాష్ట్రంలో జనసేన పార్టీ తన రాజకీయ కార్యకలాపాలను మరింత వేగవంతం చేసింది. పార్టీ భావజాలానికి ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి చేరాలనుకునే నేతలు, విద్యావంతులు, సామాజికవేత్తలు, తటస్థులను ఆహ్వానించేందుకు, ఆ చేరికలను క్రమబద్ధంగా సమన్వయం చేసేందుకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం ఏడుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక “తెలంగాణ జాయినింగ్స్ కమిటీ ని నియమించింది. ఈ కమిటీలో ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, డా. గడల శ్రీనివాస్ (మాజీ తెలంగాణ రాష్ట్ర మెడికల్ డైరెక్టర్), గొట్టిముక్కల నరేష్ రెడ్డి, అబ్దుల్ హనీఫ్, అల్లాడి తనీష్, చిరాగ్ ప్రజీత్ గౌడ్, మేడూరి సరస్వతి (మాజీతెలంగాణ రాష్ట్ర డీసీపీ) సభ్యులుగా వ్యవహరించనున్నారు.


జనసేన JANASENA

23-06-2026

జనసేన పార్టీలో చేరికల సమన్వయానికి
తెలంగాణ జాయినింగ్స్ కమిటీ

• 7 మంది సభ్యులతో తెలంగాణ కమిటీ ఏర్పాటు

ఈ కమిటీలో

ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

డా. గడల శ్రీనివాస్ ( Ex తెలంగాణ రాష్ట్ర మెడికల్ డైరెక్టర్)

గొట్టిముక్కల నరేష్ రెడ్డి

అబ్దుల్ హనీఫ్

అల్లాడి తనీష్

చిరాగ్ ప్రజీత్ గౌడ్

మేడూరి సరస్వతి ( Ex తెలంగాణ రాష్ట్ర DCP) సభ్యులుగా ఉంటారు.

- జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం,
తెలంగాణ.

తెలంగాణ వ్యాప్తంగా విస్తృతంగా వస్తున్న చేరికల విజ్ఞప్తులను ఈ జాయినింగ్స్ కమిటీ మొదట క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఆ తర్వాత ఆ వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి పరిశీలించి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తారు. అనంతరం ఆయన ఇచ్చే దిశా నిర్దేశం, కీలక సూచనల మేరకు తెలంగాణలో భారీ ఎత్తున చేరికల కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించనున్నారు. ఈ తాజా కమిటీ ఏర్పాటుతో తెలంగాణలో జనసేన పార్టీ క్షేత్రస్థాయి బలోపేతం పై ప్రత్యేక దృష్టి సారించి, రాజకీయంగా స్పీడ్ పెంచిందని స్పష్టమవుతోంది.

## ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం..
## 200 పైగా దగ్ధమైన కార్మికుల నివాసాలు




**న్యూస్ డెస్క్, 24 జూన్ (ఇది కద నిజం):** ఢిల్లీలోని ఉద్యోగ్ భవన్ సమీపంలో ఉన్న కార్మికుల నివాసాల్లో (ఝుగ్గీలు) బుధవారం వేకువజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు 200 తాత్కాలిక రేకుల షెడ్లు అగ్నికి ఆహుతయ్యాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రాణనష్టం తప్పిందని అధికారులు వెల్లడించారు. ఢిల్లీ అగ్నిమాపక దళం (డిఎఫ్ఎస్) అధికారుల సమాచారం మేరకు.. తెల్లవారుజామున 3.02 గంటల ప్రాంతంలో కార్మికుల గుడిసెల వద్ద ఉన్న ఓ విద్యుత్ ప్యానెల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గుడిసెలు ఒకదానికొకటి ఆనుకుని ఉండటంతో పాటు, లోపల ఉన్న వంట గ్యాస్ (ఎల్పీజీ) సిలిండర్ల కారణంగా మంటలు అత్యంత వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే 19 ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. తీవ్రంగా శ్రమించి ఉదయం 5.30 గంటలకల్లా మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.

కారణాలపై దర్యాప్తు...

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, ప్రమాదానికి గల కచ్చితమైన కారణం, ఆస్తి నష్టం అంచనాపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ‘సెంట్రల్ విస్టా’ ప్రాజెక్టులో భాగంగా.. 1950ల్లో నిర్మించిన ప్రముఖ ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ‘ఉద్యోగ్ భవన్’ను ప్రస్తుతం కూల్చివేస్తున్నారు. దాని పక్కనే ఉన్న నిర్మాణ్ భవన్ కూల్చివేత అనంతరం ఈ పనులు చేపట్టారు. ఈ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల కోసమే ఇక్కడ ఈ తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేశారు.

## తుంగభద్రపై తలపడ్డ తుఫాన్ నీటి రాజకీయాలపై ఘాటు లేఖ

మొదటి పేజీ తరువాయి




పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే పాలమూరు రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు, మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదు? దీని వెనుక ఉన్న లోపాయికార ఒప్పందాలు ఏమిటని ప్రశ్నించారు.

నాలుగు డిమాండ్లు:

ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల తరపున, పాలమూరు రైతాంగం తరపున రాష్ట్ర ప్రభుత్వాన్నికి హరీశ్ రావు తన లేఖలో 4 డిమాండ్లు చేశారు.

1, తుంగభద్రపై కర్ణాటక చేపడుతున్న అక్రమ ప్రాజెక్టులను తక్షణమే అడ్డుకోవాలి. సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు అధికారిక అభ్యంతరాలు తెలియజేయాలి.

2, తుంగభద్ర జలాల వినియోగంలో బచావత్ ట్రిబ్యునల్ విధించిన నిబంధనలను కర్ణాటక తు.చ తప్పకుండా పాటించే విధంగా చర్యలు తీసుకోవాలి.

3,అవసరం అయితే కర్ణాటక అక్రమ ప్రాజెక్టులపై సుప్రీం కోర్టులో కేసు వేయాలి.

4, కమిషన్ల కొడంగల్ లిఫ్ట్ కోసం తెలంగాణ జల హక్కులను బేరసారాల అంశంగా మార్చలేదని ప్రభుత్వం నిరూపించాలి.

ఆ అధికారం ఎవరిచ్చారు?:

కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కర్ణాటక నుంచి ఎన్ఓసి తెస్తున్నామనే సాకు చెప్పి, తెలంగాణ జల హక్కులను బేరసారాల అంశంగా మార్చారా? తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి (2 టీఎంసీ), చిక్కాలపర్వి(2.5 టీఎంసీ), చిక్కాలమంచి (5 టీఎంసీ) బ్రిడ్జ్-కమ్-బరాజ్‌లకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి? అని ప్రశ్నించారు. ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా? తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారు? అని నిలదీశారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా? లేక తెలిసే ఇదంతా చేస్తున్నారా? రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే మీరు, మీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా? ఈ అక్రమ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కనీసం ఒక్క లేఖ కూడా ఎందుకు రాయలేదన్నారు.

ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం:

ఇప్పటికే ఆర్డీఎస్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు సరిగా అందని పరిస్థితి ఉంది. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్?లో కర్ణాటక వాటా 1.2 టీఎంసీ మాత్రమేనని కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం, వాటిని దెబ్బతీసే కర్ణాటక అక్రమ నిర్మాణాలకు పరోక్షంగా సహకరించడం రాష్ట్రానికి ద్రోహం చేయడం కాదా అన్నారు.

పాలమూరు రైతాంగానికి మరోసారి అన్యాయం:

ఉమ్మడి పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఆర్డీఎస్‌కు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేసీఆర్ ప్రభుత్వం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. చివరి ఆయకట్టులోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టింది. కేసీఆర్ ప్రారంభించిన ఆర్డిఎస్ ఫేస్ 2 ను పడావు పెట్టిన మీరు, ఇప్పుడు కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుంది. చివరి దశలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నారాయణ పేట, కొడంగల్ కు నీళ్ళు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా దాన్ని పక్కనబెట్టారు. కమీషన్ల కొడంగల్ లిఫ్ట్ పేరిట భీమా ప్రాజెక్టు ఆయకట్టు రైతుల శాశ్వత ప్రయోజనాలను దెబ్బతీసారు. 16.94 టీఎంసీల కేటాయింపులో సుమారు 7 టీఎంసీలను కొడంగల్ లిఫ్టుకు మళ్లించి రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించే భీమా ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు. ఇప్పుడు ఆర్డీఎస్ విషయంలో కర్ణాటకతో లోపాయికార ఒప్పందం చేసుకొని పాలమూరు రైతాంగానికి మరోసారి అన్యాయం చేస్తున్నారు.

ఇంత జరుగుతుంటే ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు:

కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయి. ఇది కేవలం ఒక ప్రాజెక్టు సమస్య కాదు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన అంశం. తుంగభద్ర జలాలను కర్ణాటక ఇష్టారాజ్యంగా వినియోగించకుండా బచావత్ ట్రిబ్యునల్ అనేక నిబంధనలను కృష్ణా అవార్డులో పొందుపరచింది. అయినప్పటికీ ఆ నిబంధనలు ఖాతరు చేయకుండా, ఎటువంటి అనుమతులు లేకుండా బ్రిడ్జి కం బ్యారేజీలను, ఎత్తిపోతల పథకాలను నిర్మించడానికి పూనుకుంటున్నది. ఇంత ద్రోహం జరుగుతుంటే మీరు, మీ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించడం తెలంగాణా ప్రయోజనాలకు ద్రోహం తలపెట్టడం కాదా ?

మరో సారి ఉద్యమించాల్సిన పరిస్థితి తేవొద్దు:

సమైక్య పాలనలో కృష్ణా జలాల కేటాయింపులో, వినియోగంలో జరిగిన అన్యాయాలకు, వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన పాలమూరు ప్రజలు, తమ జల హక్కులను కాపాడుకోవడానికి మరోసారి ఉద్యమించాల్సిన పరిస్థితి తీసుకురావద్దని హెచ్చరిస్తున్నాం. తెలంగాణకు హక్కుగా రావాల్సిన ప్రతి నీటి చుక్కను కాపాడటం ప్రభుత్వ చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన బాధ్యత. స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రతి నిర్ణయాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. పాలమూరు రైతాంగం భవిష్యత్తు కోసం, తెలంగాణ జల హక్కులను కాపాడటం కోసం బీఆర్ఎస్ నిర్విరామ పోరాటం చేస్తుందని ఎంత దూరం దాకా అయినా వెళ్లి కొట్లాడుతుందన్నారు.

# ప్రభుత్వ భూమిలో మైసా కన్స్ట్రక్షన్ కోసం అక్రమ రహదారిపై విచారణ జరపాలి: ఆకుల సతీష్ డిమాండ్

ఇది కద నిజం,కుత్బుల్లాపూర్: పేట్ బషీర్‌బాద్ పరిధిలోని సర్వే నంబర్ 23లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని మైసా కన్స్ట్రక్షన్ ప్రాజెక్టుకు అప్రోచ్ రోడ్డుగా అక్రమంగా వినియోగిస్తున్నారనే అంశంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ పరిధిలోని పేట్ బషీర్‌బాద్ సర్వే నంబర్ 23లో సుమారు 5.25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఇందులో ఒక ఎకరా ప్రభుత్వ పాఠశాల కోసం, మరో భాగం పేదల అవసరాల కోసం, అలాగే సుమారు రెండు ఎకరాలు ట్రాఫిక్ డీసీపీ జోనల్ కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్మాణం కోసం కేటాయించబడినట్లు తెలిపారు. అయితే, ఈ భూమికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్లు 12, 24లో మైసా కన్స్ట్రక్షన్ సంస్థ భారీ నిర్మాణ పనులు చేపట్టిందని, దానికి సరైన 60 అడుగుల అప్రోచ్ రోడ్ లేకపోయినా జీహెచ్ఎంసీ అనుమతులు మంజూరు చేశారని ఆరోపించారు. 2021లో హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్ రోడ్డు పేరుతో జీవో జారీ చేశారని, అనంతరం ప్రభుత్వ భూమిలో నిర్మించిన ట్రాఫిక్ డీసీపీ కార్యాలయాన్ని 2023 జూన్ 25న కూల్చివేశారని పేర్కొంటూ దీనిపై అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పాత్రపై విచారణ జరగాలన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా, ఈ నిర్మాణానికి సంబంధించి హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, కలెక్టర్, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల పూర్తి అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూమిలో తారు రోడ్డు నిర్మించారని ఆరోపించారు. మైసా కన్స్ట్రక్షన్ ప్రాజెక్టు వద్ద సుమారు 1200 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, ఇటీవల ప్రజావాణిలో తాము చేసిన ఫిర్యాదు మేరకు స్పందించిన హైడ్రా కమిషనర్ కార్యాలయం సదరు ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షించాలని అధికారులకు లేఖ



పంపినట్లు వెల్లడించారు. తక్షణమే ప్రభుత్వ భూమిలో నిర్మించిన రహదారిపై, మైసా కన్స్ట్రక్షన్‌కు ఇచ్చిన అనుమతులపై సమీక్ష నిర్వహించి, సదరు స్థలాన్ని పార్క్ లేదా ట్రాఫిక్ డీసీపీ కార్యాలయానికి కేటాయించి ప్రభుత్వ భూమిని రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్ల జై శంకర్ గౌడ్, పులి బలరాం, ఎల్ల స్వామి, అంకం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోయిన హెడ్ కానిస్టేబుల్ రాజకుమార్‌కు కన్నీటి వీడ్కోలు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, పిట్లం, జూన్ 24: విధి నిర్వహణకు వెళ్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో పిట్లం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రాజకుమార్ మృతి చెందడం పోలీసు శాఖను విషాదంలో ముంచెత్తింది. జూన్ 23న మద్నూర్ నుంచి పిట్లం వస్తుండగా పెద్దకొడపగల్ శివారులో జాతీయ రహదారి--161పై అజాగ్రత్తగా పార్క్ చేసిన లారీని ఢీకొని ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఈరోజు ఎడపల్లిలో నిర్వహించిన అంత్యక్రియల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పిట్లం ఎస్ఐ ఆంజనేయులు, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు షకీల్ పాషా, వివిధ పోలీస్ స్టేషన్ల పోలీసు సిబ్బంది, 1998 బ్యాచ్ సహచరులు పాల్గొని రాజకుమార్‌కు ఘన నివాళులర్పించారు. విధి పట్ల అంకితభావంతో పనిచేసిన రాజకుమార్ అకాల మరణం పోలీసు శాఖకు తీరని లోటని సహచరులు ఆవేదన వ్యక్తం చేశారు.

# పడకేసిన పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండీ

## లీకేజీలు, చెత్తాచెదారంతో ప్రజల ఆందోళన





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, పిట్లం, జూన్ 24: పిట్లం మండలంలోని చిన్న కొడప్గల్ గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో డ్రైనేజీ లీకేజీలు కొనసాగుతుండగా, చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు మరియు పంచాయతీ పాలకవర్గం తగిన చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. లీకేజీల కారణంగా మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుండగా, దోమలు, ఈగలు విపరీతంగా పెరిగే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. చెత్తాచెదారం సకాలంలో తొలగించకపోవడంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, లీకేజీలను మరమ్మతు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఇకనైనా పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది గ్రామంలో పర్యటించి సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని, చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు అధికారులు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# పిట్లం మండలంలోని విత్తన ఎరువుల దుకాణాల తనిఖీ





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూన్ 24: మండలంలోని దుకాణాలను తనిఖీ చేసి లైసెన్స్, సీడ్, పెస్టిసైడ్ మరియు ఫర్టిలైజర్ స్టాక్ రిజిస్టర్స్ మరియు నిల్వాలు పరిశీలించడం జరిగింది. లైసెన్స్ సూచిక, ధరల పట్టిక, విత్తనాల మరియు పెస్టిసైడ్స్ పీసీలు తనిఖీ చేయడం జరిగింది. తనిఖీల ఆధారంగా దుకాణాలపై తగు చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్ రోజు అప్డేట్ చేయాలి అని, విత్తనాలు మరియు ఎరువులు గరిష్ట ధర కంటే ఎక్కువగా అమ్మ రాదని, నాసిరకం విత్తనాలు పురుగుమందులు అమ్మ రాదని, లేనిచో లైసెన్స్ పూర్తిగా రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి కొనుగోలు దారుకి కచ్చితంగా బిల్లు ఇవ్వాలని సూచించడం జరిగింది. అధికారులు అడిగినప్పుడు రిపోర్ట్స్ ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి వినోద్ సూచించారు.

# వికారాబాద్ జిల్లాలో భారీగా నకిలీ పత్తి విత్తనాలు సీజ్

## : ఐదుగురు నిందితుల అరెస్ట్

ఇది కద నిజం,పరిగి: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్న ముఠాలపై వికారాబాద్ జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు పరిగి పోలీసులు, టాస్క్ ఫోర్స్ సంయుక్త బృందం వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. ఈ తనిఖీల్లో భాగంగా సుమారు రూ. 35 లక్షల విలువైన 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలతో పాటు ఒక బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణా మరియు విక్రయాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు కర్ణాటక రాష్ట్రంలో జిన్నింగ్ చేయించి, కిలో కేవలం రూ. 500 చొప్పున నకిలీ విత్తనాలను తయారు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఆ తర్వాత వాటిని వికారాబాద్ జిల్లాలోని అమాయక రైతులకు కిలో రూ. 1500 నుండి రూ. 2000 వరకు విక్రయిస్తూ భారీ దోపిడీకి పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.





ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా నకిలీ విత్తన వ్యాపారులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. కష్టపడి సాగు చేసే రైతులకు నకిలీ విత్తనాలు అమ్మి మోసం చేస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయించినా, నిల్వ చేసినా లేదా రవాణా చేసినా బాధ్యులపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అదే సమయంలో రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని, కేవలం ప్రభుత్వ గుర్తింపు పొందిన అధికారిక డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు కొన్న ప్రతిసారీ తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని, అనుమానాస్పద విక్రయాలపై పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

# మానవ హక్కుల కమిషన్ పిట్లం మండల అధ్యక్షులు గా షేక్ మహబూబ్ నియామకం




ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, పిట్లం, జూన్ 24: మానవ హక్కుల కమిషన్ పిట్లం మండల అధ్యక్షులు గా షేక్ మహబూబ్ ఉప అధ్యక్షులు గా అవుసుల దత్తు నియమితులయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా షేక్ మహబూబ్ మాట్లాడుతూ, మానవ హక్కులకు భంగం కలిగిన సందర్భాల్లో బాధితులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తే న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అవుసుల దత్తు, కార్యదర్శి మంగలి రాజు తదితరులు పాల్గొన్నారు.

# కడప పార్లమెంట్ అబ్జర్వర్ కమిటీ సభ్యునిగా "డా. గోగు లక్ష్మీ భరత్" నియామకం..



ఇది కద నిజం న్యూస్ కడప జిల్లా జూన్ 24:జనసేన పార్టీ సంస్థాగత బలోపేతం కోసం చేపట్టిన నిర్మాణ సారథులు కార్యక్రమంలో భాగంగా కడప పార్లమెంట్ పరిధికి సంబంధించిన పార్లమెంట్ అబ్జర్వర్ కమిటీ సభ్యునిగా డా. గోగు లక్ష్మీ భరత్ నియమితులయ్యారు.ప్రస్తుతం డా. గోగు లక్ష్మీ భరత్ ఏఎంసీ డైరెక్టర్ గా సేవలందిస్తూ, మైదుకూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం మరియు పార్టీ విస్తరణ కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం, సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం ఈ కీలక బాధ్యతను అప్పగించింది.

ఈ సందర్భంగా డా. గోగు లక్ష్మీ భరత్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి, పార్టీ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కడప పార్లమెంట్ పరిధిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేస్తూ, పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. డా. గోగు లక్ష్మీ భరత్ నియామకాన్ని పురస్కరించుకొని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో

# విద్యా సామాగ్రి పంపిణీ




ఇది కద నిజం న్యూస్ కడప జిల్లా జూన్ 24: కడప జిల్లా.. జమ్మలమడుగు పట్టణానికి చెందిన మాడెం గురు శంకర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ ఉద్యోగి ఆర్థిక సహాయంతో ఖాజీపేట మండలం కొత్త పుల్లూరు యానాది కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు చదువుతున్న సుమారు 50 మంది విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి మరియు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చేతుల మీదుగా పలకలు, బలపాలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, ఎరేజర్, షాప్నర్స్ వంటి విద్యా సామాగ్రి పంపిణీ చేయడం జరిగింది. మండల విద్యాశాఖ అధికారి-2 సత్య నాగ రాజు మాట్లాడుతూ.. దాతల రూపంలో ఉచితంగా పంపిణీ చేసిన విద్యాసామాగ్రిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నంద్యాల రవి చంద్ర మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి తమ జీవిత కాలంలో సామాజిక బాధ్యతగా భావించి కనీసం 5 మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునివ్వడం జరిగింది.

అనంతరం పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి వాగ్దాడం శివశంకర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాప్, నాగరాజు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లింగ నాయక్, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమం ట్రస్టు నిర్వాహకులు మాలకొండయ్య ఆచారి పాల్గొన్నారు..

# పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలి: కొన్నె లక్ష్మయ్య



ఇది కద నిజం, కుక్కునూరు: యూరియా సరఫరాకు మొబైల్ యాప్ విధానం వద్దు అని, పాత పద్ధతిలోనే సరఫరా చేయాలని కుక్కునూరు మండల సీపీఐ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాప్ విధానంతో కుక్కునూరు ఏజెన్సీలో సిగ్నల్స్ అందక రైతులు యూరియా కోసం గతంలో పడరాని పాట్లు పడ్డారని ఆ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ కావడంతో ముందుస్తుగానే యూరియాను పట్టదారు పాస్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు ప్రతిపాదిక చేసుకొని రైతులకు యూరియాను సకాలంలో పంపిణీ చేయాలని వ్యవసాయ అధికార యంత్రాంగాన్ని కోరారు. స్మార్ట్ ఫోన్లు లేని సాధారణ రైతులు, యాప్ సాంకేతికతపై అవగాహన లేని వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగానే పట్టదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులను పరిశీలించి రైతులకు యూరియాను అందించాలని ఆయిన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వరకా శ్యామల, అయితా సురేష్ బాబు, మైసాక్షి వెంకటాచారి, కురాకుల బాబూరావు, పల్లాల భిక్షం పాల్గొన్నారు.



# గురుకుల పాఠశాల మంజూరు పై కృతజ్ఞతలు తెలిపిన హోం మంత్రి

నక్కపల్లి, జూన్ 24 (ఇది కద నిజం): : అనకాపల్లి జిల్లాలోని నక్కలపల్లిలో మహాత్మా జ్యోతిబా ఫూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నక్కపల్లిలో ప్రత్యేక బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని స్థానిక మత్స్యకారులు, బీసీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వారి అభ్యర్థనను పరిశీలించిన ప్రభుత్వం పాఠశాల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు హోం మంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించి పాఠశాల మంజూరు చేసినందుకు వారిద్దరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# సినిమా న్యూస్

## షూటింగ్ పూర్తి చేసుకున్న ‘విశ్వనాథ్ అండ్ సన్స్’




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ చిత్రంలో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. మమిత బైజు ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనుండగా, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగ వంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రాన్ని ఆగస్టు 21న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ మూవీ షూటింగ్‌ను మేకర్స్ తాజాగా పూర్తి చేసినట్లు సమాచారం.

అంతేకాకుండా, ఈ చిత్రానికి సంబంధించిన కొంత భాగం పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. మిగిలిన పనులను మరికొద్ది రోజుల్లో ముగించి, ఆ తర్వాత భారీ స్థాయిలో ప్రమోషన్స్ ప్రారంభించాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. చాలా కాలంగా వరుస అపజయాలతో సతమతమవుతున్న సూర్య, ఇటీవల ‘వీరభద్రుడు’ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నాడు. దీంతో ఇప్పుడు ‘విశ్వనాథ్ అండ్ సన్స్’పై కూడా ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ సినిమాతో సూర్య మరోసారి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

## ‘ధర్మన్’గా సూపర్ స్టార్




సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘తలైవర్ 173’కు సంబంధించిన టైటిల్ మరియు ఫస్ట్ లుక్ పోస్టర్ ను మేకర్స్ తాజాగా అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి ‘ధర్మన్: ది డెడ్లీ డాక్టర్’ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన పోస్టర్‌లో రజనీకాంత్ డాక్టర్ గెటప్‌లో కనిపిస్తూ, చేతిలో శస్త్రచికిత్స పరికరాలతో మాస్ లుక్‌లో దర్శనమిచ్చారు.

ఆయన లుక్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రానికి అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తుండగా, లోకనాయకుడు కమల్ హాసన్ సమర్పిస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో యోగి బాబు, సిమ్రాన్, రాశి ఖన్నా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ‘కూలీ’ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్న రజనీకాంత్, ‘ధర్మన్’లో మరో పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్న నేపథ్యంలో అభిమానుల్లో భారీ స్థాయిలో ఆసక్తి నెలకొంది.

## చరణ్ కు నేషనల్ అవార్డ్! : చిరంజీవి



రామ్ చరణ్ కథానాయకుడిగా, దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన తాజా చిత్రం ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన చిత్ర విజయోత్సవ సభకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన మాటలు అటు అభిమానులను, ఇటు చిత్ర యూనిట్‌ను ఎంతో ఉత్సాహపరిచాయి. చిరంజీవి మాట్లాడుతూ, ఈ మధ్య కాలంలో తనను ఇంతగా భావోద్వేగానికి గురిచేసిన సినిమా మరొకటి లేదని అన్నారు. “సాధారణంగా ఒక సినిమా చూస్తున్నప్పుడు నటుడిగా సాంకేతిక విషయాలు, ప్రొడక్షన్ వాల్యూస్ గమనిస్తూ ఉంటాను. కానీ ‘పెద్ది’ చూస్తున్నంతసేపు నేను ఆ క్యారెక్టర్‌తో పాటు ట్రావెల్ అయ్యాను. గిరిజనుల జీవన విధానం, వారి ఆవేదన, పోరాటం నన్ను ఒక కొత్త లోకంలోకి తీసుకెళ్ళాయి” అని పేర్కొన్నారు. ఇంతటి శక్తివంతమైన కథను నమ్మి, తెరపై అద్భుతంగా ఆవిష్కరించిన దర్శకుడు బుచ్చిబాబును ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. అలాగే ఇలాంటి ప్రతిభావంతులైన శిష్యులను పరిశ్రమకు పరిచయం చేస్తున్న దర్శకుడు సుకుమార్ విజన్‌ను కొనియాడారు.

రామ్ చరణ్ నటన గురించి చిరంజీవి మాట్లాడుతూ ఒక తండ్రిగా ఎంతో గర్వపడ్డారు. “రంగస్థలం సినిమా చూసినప్పుడు చరణ్ ఇంతకంటే బాగా ఏం చేస్తాడు అనుకున్నాను. కానీ కేవలం మూడేళ్ల వ్యవధిలోనే ‘పెద్ది’ వంటి విభిన్నమైన పాత్రతో రావడం నా ఊహకు అందలేదు. థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు నేను, సురేఖ ఎక్కడా చరణ్‌ను చూడలేదు.. మాకు కేవలం ‘పెద్ది’ మాత్రమే కనిపించాడు. కేవలం ముఖ కవళికలతో కాకుండా, కళ్ల ద్వారా భావాలను పలికించి ప్రేక్షకులను కంటతడి పెట్టించడం పరిపక్వత గల నటనకు నిదర్శనం” అని ప్రశంసించారు.

## ‘సర్దార్ -2’ రిలీజ్ డేట్ ఫిక్స్

కోలీవుడ్ వర్సటైల్ యాక్టర్ కార్తీ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ ‘సర్దార్ 2’. పి.ఎస్. మిత్రన్ దర్శకత్వంలో గతంలో వచ్చిన బ్లాక్‌బస్టర్ ‘సర్దార్’ చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమా చాలా కాలంగా షూటింగ్ దశలోనే ఉంది. కార్తీ ఇతర సినిమాల కారణంగా ఈ సినిమా కాస్త ఆలస్యం అవుతూ వస్తోంది. అయితే ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. భారీ బడ్జెట్, హై-వోల్టేజ్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఈ ఏడాది సెప్టెంబర్ 10, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది.




ప్రస్తుతం ఈ రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. కార్తీ మార్కెట్ రేంజ్‌ను మరింత పెంచేలా ఈ స్పై థ్రిల్లర్‌ను తమిళ్‌తో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో భారీ ఎత్తున విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. జూన్ నెలలో షూటింగ్ ఫినిష్ చేసి పోస్ట్ ప్రొడక్షన్ పనులను పూర్తి చేసి ఆన్ టైమ్ కి రిలీజ్ చేసేలా పక్కా ప్లానింగ్ రెడీ చేస్తోంది యూనిట్. ఈ చిత్రంలో కార్తీ మరోసారి పవర్‌ఫుల్ ‘ఏజెంట్ సర్దార్’ పాత్రలో మెస్మరైజ్ చేయనున్నారు. ‘మిషన్ ఆఫ్ ఎ లైఫ్ టైమ్’ అనే ట్యాగ్‌లైన్‌తో రాబోతున్న ఈ సినిమా మొదటి భాగం కంటే రెట్టింపు యాక్షన్, ఇంటెన్స్ డ్రామా మరియు గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో ఉండబోతుందని సమాచారం. ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య విలన్‌గా నటిస్తుండగా, మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్యామ్ సి.ఎస్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు.